
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar,Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-3-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 57 పేజీలు: 10+4 వెల: 8.00



ఐపిఎల్ 19 డే-1 ఆర్‌సిబి v/s ఎస్‌ఆర్‌హెచ్
ఆరు వికెట్ల తేడాతో ఆర్‌సిబి గెలుపు
ఆటలో...

# అక్రమ మైనింగ్‌పై సిఐడి విచారణ

2014 నుంచి ఇప్పటి దాకా జరిగిన అక్రమాలపై క్షుణ్ణంగా దర్యాప్తు

రాష్ట్ర ఖజానాకు గండికొట్టే చర్యలను సహించం: సిఎం రేవంత్ రెడ్డి

సిరిసిల్ల కేంద్రంగా ఇసుక రవాణా, ఎమ్మెల్యే గంగుల కమలాకర్,

ఎంపి వద్దిరాజు రవిచంద్ర గ్రానైట్ కంపెనీలతోపాటు

హరీష్‌రావు సోదరుడు మహేష్‌రావు మైనింగ్, రాఘవ

కన్‌స్ట్రక్షన్స్ కంపెనీపైనా విచారణకు ఆదేశం



శనివారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** అక్రమ మైనింగ్‌పై సిఎం రేవంత్‌రెడ్డి ఉక్కుపాదం మోపారు. రాష్ట్రంలో గత పదేళ్లుగా జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారాలపై సిబిసిఐడి విచారణకు ఆదేశించారు. 2014 జూన్ నుండి జరిగిన అన్ని అక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరుగుతుందని స్పష్టం చేశారు. ఆ విచారణా నివేదికను వచ్చే అసెంబ్లి సమావేశాల్లోనే సభ ముందు ఉంచుతామని సిఎం ప్రకటించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఇసుక, గ్రానైట్ అక్రమ మైనింగ్‌ను సిఎం తీవ్రంగా పరిగణించారు. సిరిసిల్ల కేంద్రంగా సాగిన ఇసుక మాఫియాపై సంతోష్‌రావు, ఆయన తండ్రి రవిందర్‌రావు పాత్రపై విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు సంబంధించిన శ్వేత గ్రానైట్ మైనింగ్ అంశాలను కూడా దర్యాప్తు పరిధిలోకి సిఎం తెచ్చారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నిర్వహించిన గాయత్రి గ్రానైట్స్‌తోపాటు >>2



## రాఘవ కన్‌స్ట్రక్షన్ మంత్రి పొంగులేటి కుటుంబ సభ్యులదే

నా ఆరోపణలు తప్పయితే నన్ను ఉరితీయండి: హరీష్‌రావు సంచలన ఆరోపణ

ప్రతిపక్ష ఎమ్మెల్యే ఛైర్మన్‌గా హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ 2లో



సౌదీలోని అమెరికా విమానస్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడి దృశ్యం

## మరో జలసంధి మూసివేతకు వ్యూహం

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఉధృతం

గల్ఫ్‌దేశాలపై మరింతగా ఇరాన్ దాడులు

నెల రోజులుగా సాగుతున్న వార్

**టెహ్రాన్, టెల్ అవీవ్,మార్చి 28:** పశ్చిమాసియా యుద్ధం రోజురోజుకూ మరింత తీవ్రం అవుతోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఇప్పటికీ కొనసాగుతుంటే ఇరాన్ కూడా తానేమీ తక్కువ కాదన్నట్లు సౌదీ అరేబియా, కువైట్ స్థావరాలు, ఎయిర్‌బేస్‌లపై దాడులుచేసి వణుకుపుట్టిస్తోంది. వీటన్నింటికంటే ఇపుడు బాబ్ అల్ మాండెబ్ జలసంధిని హౌతీలసాయంతో >>2

మూసీ పునరుజ్జీవంపై దుష్ప్రచారం చేస్తే

## శివతాండవమే

ఆరునూరైనా ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతాం

మూసీ తీరాన రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయానికి శంకుస్థాపన

దక్షిణకాశీగా అభివృద్ధి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి28:** రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరునూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద మచిలేశ్వర స్వామి(వీరభద్రస్వామి), ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. గండిపేట ప్రాంతంలో మూసీ నది ప్రక్షాళన ఈశ్వరుడి ఆశీర్వాదంతోనే ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. అన్ని అడ్డంకులను ఈశ్వరుడే తొలగిస్తాడని, ఎవరైనా దీనిపై దుష్ప్రచారం చేసినా దీనికి పెడర్థాలు అంటగట్టినా ప్రభుత్వం శివతాండవం చేస్తుందని హెచ్చరించారు. ఒక చారిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం, ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇది జరుగుతుందని అనుకోవట్లేదు శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అంటారు ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం అని పేర్కొన్నారు. మూసీ పునరుద్దరణలో భాగంగా 8ఎకరాల్లో రూ.700 కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం, ఈ ప్రాంతానికి 1400యేళ్ల చరిత్ర ఉంది ఈ చరిత్ర కనుమరుగు కాకుండా >>2



శనివారం ఓంకారేశ్వర ఆలయానికి భూమి పూజచేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, డిసిఎం భట్టి

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడాపోటీలు ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి 7లో



శనివారం భద్రాద్రిలో సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళుతున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు

## భద్రాద్రిలో రామరాజ్య వైభవం

నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ శుక్లా దంపతులు

**భద్రాచలం, ప్రభాతవార్త:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేక మహో >>2



భద్రాద్రిలో శ్రీరామ పట్టాభిషేక దృశ్యం






శనివారం చిన్నారికి అల్పాహారం ప్యాకెట్ అందచేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

అంగన్‌వాడీ చిన్నారులకు

## 'తొలిముద్ద'

ఉప్మా, కిచిడీ మిక్స్ అల్పాహారం

ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి28:** అంగన్‌వాడీ చిన్నారులకు అల్పాహారం అందించేందుకు 'తొలి ముద్ద' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా రెడీ టూ కుక్ ఫుడ్(ఉప్మా, కిచిడీమిక్స్)ను బ్రేక్‌ఫాస్ట్‌గా చిన్నారుల >>2

## 50వేల మందిని రోడ్డున పడేసే కుట్ర: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి28:** మూసీ సుందరీకరణ పేరుతో 50 వేలమందిని రేవంత్ రెడ్డి రోడ్డున పడేయాలని చూస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. పేదల ఇళ్లను కూల్చి మూసీ సుందరీకరణ చేపట్టడానికి బీఆర్‌ఎస్ వ్యతిరేకమని శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ మరో సారి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ఎత్తున చేపట్టాలనుకుంటున్న మూసీ సుందరీకరణతో పేదలు రోడ్డున పడతారని కేటీఆర్ తెలిపారు. రేవంత్ సర్కార్ ఈ ప్రాజెక్ట్ పేరు ఎత్తినప్పటి నుంచి ప్రజల మధ్య తిరుగుతూ బాధితుల మొరవింటున్నానని ప్రజల్లోని వ్యతిరేకతను >>2

## సజావుగా పెట్రోలు, గ్యాస్

ప్రజల్లో అపోహలవల్లే కొంత మేర ఇబ్బంది: మంత్రి ఉత్తమ్



శనివారం కేంద్రమంత్రులతో విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్రోలియం ఉత్పత్తులతోపాటు ఎల్‌పిజి గ్యాస్ సరఫరాలో పెరిగిన ఒత్తిడిని ప్రభుత్వం సమర్ధవంతంగా నియంత్రించిందని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వినియోగదారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తులతోపాటు వంటగ్యాస్ సరఫరాపై శనివారం కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, హార్దిప్ సింగ్ పూరి, ప్రహ్లాద్ జోషీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. వంటగ్యాస్ సరఫరాపై ప్రజల్లో అపోహలు పెరిగినందునే అయోమయం నెలకొందని, దాంతో తాత్కాలికంగా కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో సమర్థవంతంగా ఒత్తిడిని నియంత్రించగలిగామని ఆయన అన్నారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందని, డిమాండ్ మేర సరఫరా కొనసాగుతోందని, తాను స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చడంతోపాటు పంపిణీ దారులతో సమీక్షలు నిర్వహిస్తున్నానని తెలిపారు. అదే సమయంలో వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్‌పిజి కొరతను దృష్టిలో పెట్టుకొని తెలంగాణాకు వాణిజ్య అవసరాలకు పంపిణీ చేసే కేటాయింపులను పెంచాలని మంత్రి ఉత్తమ్ కేంద్ర మంత్రులను కోరారు. వాణిజ్య అవసరాలకు పంపిణీ చేసే గ్యాస్ కోటాను పెంచితే సరిపడా గ్యాస్ సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతోపాటు అక్రమాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచి కేసులు >>2

## ప్రభుత్వశాఖల్లో 'ఇవి'లు

ఆర్టీసికి రూ.4305.49కోట్లు కేటాయింపు: మంత్రి పొన్నం

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం కాలుష్య నియంత్రకు పెట్రోల్ డిజిల్ వాడకం తగ్గించడానికి ప్రభుత్వశాఖలు భవిష్యత్‌లో ఇవి వెహికిల్స్ కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకొందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం రవాణాశాఖ గ్రాంట్ల పై చర్చను ప్రారంభిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు వ్యక్తిగతంగా కొనుగోలు చేసినా కూడా వారిని ప్రోత్సహించడానికి రిజిస్ట్రేషన్‌లో, పన్నులో కూడా రాయితీతోపాటు సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రవాణా శాఖ చెక్ పోస్టులను రద్దుచేసి పారదర్శక సేవలను అందజేస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం సబ్సిడీతో ఈవి వెహికిల్స్ అందజేయడం జరుగుతుంది. పిఎం ఇ డ్రైవ్ కింద అన్ని డిజీల్ బస్సుల స్థానాల్లో ఇవివెహికిల్స్‌ను ప్రవేశపెడుతామని సభకు తెలిపారు. టిజిఎస్ ఆర్‌టిసి >>2

# మూడు రోజులపాటు అకాల వర్షాలు

## హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

### పిడుగులు పడే ప్రమాదం

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రెండు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ నెల 30వ తేదీ వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. ఉరుములు, మెరుపులతోపాటు పలు ప్రాంతాల్లో పిడుగులు కూడా పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు తోడు గంటకు 30 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. ఆది, సోమవారాల్లో జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, అదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సాయంత్రం సమయాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు. కాగా.. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మూడు రోజులు సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ముఖ్యంగా ఈదురుగాలులతో కూడిన వర్షం పడే సమయంలో చెట్ల కింద, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాల వద్ద, విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాల్లో ఉండొద్దని అధికారులు ప్రజలకు సూచించారు.

# నిర్మల్ జిల్లా పోలీసులకు స్కోచ్ అవార్డు

**హైదరాబాద్ మార్చి 28, ప్రభాతవార్త:** సమాజంలో పోలీసు శాఖ గొప్పతనాన్ని చాటిచెప్పడం, సామాన్యులకు ఉపయోగపడే పనులు చేయడం, ఆపదలో వున్న వారిని ఆదుకోవడం, దురాచారాల నిర్మూలనకు కృషి చేయడం, విద్యార్థినులకు అండగా వుండేందుకు చేబట్టిన పోలీసు అక్క పథకం, వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించినందుకు నిర్మల్ జిల్లా పోలీసులకు జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు లభించింది. ఢిల్లీలోని స్వచ్ఛంద సంస్థ స్కోచ్ ప్రతీ యేటా ప్రజల బాగోగులకు విశేషంగా కృషి చేసే ప్రభుత్వ విభాగాలకు ఇచ్చే స్కోచ్ అవార్డు ఈసారి నిర్మల్ జిల్లా పోలీసులకు లభించింది. ఈ అవార్డును జిల్లా ఎస్పి జానకీ షర్మీల ఢిల్లీలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో స్కోచ్ సంస్థ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను పటిష్టం చేయడం, సామాన్యులను ఆదుకోవడంలో పోలీసులు నిత్యం అందుబాటులో వుండడం, చిన్నారుల రక్షణకు చర్యలు తీసుకోవడం, వారిని ధైర్యవంతులైన భావి పౌరులుగా తీర్చిదిద్దడం వల్ల తమ జిల్లా పోలీసు విభాగం జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు అందుకుందని ఈ సందర్భంగా ఎస్పి జానకీ షర్మీల తెలిపారు. విద్యార్థినులకు అండగా వుండేందుకు చేబట్టిన పోలీసు అక్క అన్ని వర్గాలలో ఆదరణ లభించిందని ఆమె తెలిపారు. కాగా నిర్మల్ జిల్లా పోలీసులకు స్కోచ్ అవార్డు రావడం పట్ల డిజిపి శివధర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పి జానకీ షర్మీలతో పాటు పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.



ఢిల్లీలో స్కోచ్ సంస్థ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న నిర్మల్ జిల్లా ఎస్పి జానకీ షర్మీల

# అనుమానాస్పదస్థితిలో తల్లి, ఇద్దరు చిన్నారుల మృతి

**కంది, మార్చి 28, ప్రభాతవార్త:** తల్లి తన ఇద్దరు సంతానం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషాద సంఘటన సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని జుల్కల్‌లో శనివారం చోటు చేసుకుంది. జుల్కల్ గ్రామానికి చెందిన బీర్ల శంకర్ చేసిన ఫిర్యాదు మేరకు ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బీర్ల శంకర్ రెండవ కుమార్తె మమత (27)ను 2017లో జుల్కల్ గ్రామానికి చెందిన పట్నం ప్రవీణ్‌తో వివాహం జరిగిందని, వైవాహిక జీవితంలో ఇద్దరికి సంతానం ఇచ్చిందన్నారు. 5 జనవరి 2026న పట్నం ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మమత మానసికంగా కుంగిపోయిందన్నారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తీసి చూడగా ఇద్దరు చిన్నారులు నేలపై పడి ఉండగా తల్లి మమత దూలానికి ఉరివేసుకుని కానవచ్చిందన్నారు. చిన్నారుల గొంతు భాగంలో గాయాలు ఉన్నట్లు గుర్తించారు. భర్త మృతి కారణంగానే మమత తన ఇద్దరులను చంపి తను ఆత్మహత్య చేసుకుని ఉంటుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# పెండింగ్‌లో 40 గిగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు

## ఒప్పందాలకు ముందుకురాని సంస్థలు

### తిరిగి బిడ్ ఓపెన్ చేసేందుకు కేంద్రం యోచన

### విద్యుత్ నియంత్రణ కమిషన్‌చే ప్రత్యేక మార్గదర్శకాలు

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పిపిఎ) లేకపోవడం వల్ల దేశ వ్యాప్తంగా 40 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు నిలిచిపోయాయి. పెరుగుతున్న డిమాండ్‌ను అధిగమించేందుకు, థర్మల్ పవర్ ప్రాజెక్టులకు ప్రత్యమ్నాయంగా కేంద్రం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ప్రోత్సాహం కల్పిస్తోంది.

ఇందులో భాగంగానే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు కేంద్రం బిడ్లు పిలిచినా, వాటిలో 40 గిగావాట్ల సౌర, పవన సామర్థ్య ప్రాజెక్టుల ఏర్పాటుకు సంస్థలేవీ ముందుకు రాక ఒప్పందాలు చేసుకోకపోవడంతో అవి పెండింగ్‌లో ఉండిపోయాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం వాటికి తిరిగి బిడ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి ఒకరు తెలిపారు.

ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించిన ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సిఈఆర్సీ) వర్చువల్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు మార్గదర్శకాలను విడుదల చేయనుంది. నిలిచిపోయిన ఈ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ అన్ లాక్ చేసే అవకాశం ఉంది.

సౌర ప్రాజెక్టుల టారిఫ్ రేటు యూనిట్‌కు రూ.2.38 నుండి రూ.2.56 వరకూ ఉంటుందని, అలాగే వెనిల్లా విండ్‌కు యూనిట్‌కు రూ.3.70 నుండి 3.90 వరకూ ఉంటుందని తెలుస్తోంది. వర్చువల్ పిపిఎలు కార్పొరేట్ కొనుగోలుదారులు భౌతిక విద్యుత్ సరఫరాను తీసుకోకుండా పునరుత్పాదక ప్రాజెక్టులను ఆర్థికంగా అండర్‌రైట్ చేయడానికి అనుమతిస్తాయని, బదులుగా గ్రీన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్‌కు రుజువుగా పునరుత్పాదక ఇంధన ధృవీకరణ పత్రాలను పొందవచ్చిని విద్యుత్ నియంత్రణ కమిషన్ పేర్కొంటోంది.

# హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం

## మెట్రో ఫేజ్-1ను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం

## శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సిఎం రేవంత్

## ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎల్అండ్‌టి నిర్వహణలో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి శాసనస సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుందన్నారు. నగరవాసుల చిరకాలవాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసిందని సిఎం చెప్పారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభు త్వం ప్రతిష్టాత్మక ప్రణాళి కలను సిద్ధం చేసిందన్నారు. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటంవల్ల కొత్తగా చేపట్ట బోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక, చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్‌వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్అండ్‌టి సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ స్వాధీన ప్రక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించిందని చెప్పారు. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిం చామన్నారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుం టుందని సిఎం ధీమా వ్యక్తం చేశారు. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగు పరచడమే ప్రభుత్వ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యమన్నారు. మెట్రో నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వమే నేరుగా చేపట్టడం వల్లచేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు, కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మెట్రో ఫేజ్-2 విస్తరణ త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహద పడుతుందని సీఎం పేర్కొన్నారు. కాగా సిఎం ప్రవేశపెట్టిన మెట్రో ఫేజ్-1 స్వాధీన తీర్మానానికి శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

**మెట్రో తీర్మాన ఆమోదంపై బిఆర్ఎస్ నిరసన**

మెట్రో-ఫేజ్-1 స్వాధీనంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా ఆమోదించిందని సభాపతి ప్రకటించిన నిర్ణయంపై బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీష్‌రావు సభలో నిరసన వ్యక్తం చేశారు. ఇది ఏకగ్రీవ తీర్మానం కాదని, ఏకపక్ష తీర్మానమని విమర్శించారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యుల అభిప్రాయం తీసుకోకాకుండా తీర్మాణం ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ఎలా ప్రకటిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శాసనసభ నడిపే వ్యవహారం, పద్ధతి ఇది కాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి సభలో తీర్మాణాన్ని ప్రవేశపెట్టే హక్కు ఉందని, కాని దానిపై ఎలాంటి చర్చ జరపకుండా సభ్యులంతా ఆమోదించినందుకు సిఎం ధన్యవాదాలు అని చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామంపై బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర నిరసన తెలుపుతున్నారన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు రానివ్వం

## అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల కొంత ఇంధన సమస్య నిజమే..

## పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటున్నాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (ముషీరాబాద్), మార్చి 28, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన యుద్ధ వాతావరణం, అంతర్జాతీయ ఉద్రిక్తల కారణంగా మన దేశ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడటమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం కవాడిగూడలోని సిజిఓ టవర్స్‌లో తెలంగాణలో పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి, ఎల్‌పిజి సరఫరా మరియు లభ్యత పరిస్థితులపై ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, డీలర్స్ అసోసియేషన్స్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గత వారం రోజులుగా మన తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ మరియు వంటగ్యాస్ సరఫరాలపై ప్రజల్లో ఆందోళన నెలకొందని, కొన్ని ప్రాంతాల్లో పెట్రోలు పంపుల్లో ఇంధనం లేదని మూసివేసిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని తెలిపారు.

వాస్తవానికి ఈ పరిస్థితులు కేవలం మన రాష్ట్రానికో, దేశానికో మాత్రమే పరిమితం కాదని, ప్రపంచ వ్యాప్తంగా ఈ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో మనం ఇతర దేశాలపై ఆధారపడు తున్నందున ప్రపంచ పరిస్థితుల ప్రభావం మన దేశంపైన కూడా పడుతోందని, అయినవనపటికీ మన భారత ప్రభు త్వం సమర్థవంతంగా చర్యలు తీసు కుంటోందని స్పష్టం చేశారు. దేశంలో అంతర్గతంగా జరుగుతున్న ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచుతూ, అవసరమైన ఇంధనాన్ని దేశంలోనే అందించే దిశగా కృషి జరుగు తోందని, విదేశాల నుంచి రావల్సిన పెట్రోలియం ఉత్ప త్తులను కూడా విజయవంతంగా దిగుమతి చేసుకునే విధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక సమస్యలు ఎదురవుతున్న ఈ సమయంలో భారత ప్రభుత్వం ప్రతి రోజు అనేక దేశాల నాయకులతో చర్చలు జరిపి, దేశానికి అవసరమైన ఇంధనాన్ని ఇతర దేశాలు నిర్ణయించిన ధరలను చెల్లించి, పెట్రోల్ మరియు డీజిల్ వంటి ఉత్పత్తులను దేశానికి తీసుకురావటానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐఓసీఎల్ ఈడీ పియూష్ మిట్టల్, బిపిసిఎల్ సిజిఎమ్ రిటైల్ నితిన్ సెలుకర్, హెచ్ పిసిఎల్ సిజిఎం రిటైల్ సుశీల్ కుమార్‌రాయ్, తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ రిప్రజెంటేటివ్ అమరేందర్‌రెడ్డి, ఎల్‌పిజి డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న మ్యూల్ ఖాతాల సైబర్ నేరగాళ్లు

## ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో బడా నేరగాళ్లకు బ్యాంకుల ఖాతాలు ఇస్తున్న వ్యాపారులు, ఉద్యోగులు

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** విదేశాల్లో ఉంటూ భారత్‌లో సైబర్ నేరాలకు పాల్పడుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లకు రాష్ట్రంలో మ్యూల్ ఖాతాలు ఇస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అరెస్టు చేసిన నేరగాళ్లలో ఉత్తర, పశ్చిమ, తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉండగా కొంతకాలంగా తెలంగాణకు చెందిన వారు పెరుగుతుండడం సంచలనం రేపుతోంది. హైదరాబాద్‌తోపాటు నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలకు చెందిన కొందరు వ్యాపారులు, ఉద్యోగులు విదేశాలతోపాటు రాజస్థాన్, ఢిల్లీ కేంద్రంగా గోల్‌మాల్ సాగిస్తున్న బడా నేరగాళ్లకు సహకరించేందుకు తమ బ్యాంకుల ఖాతాలను అందిస్తున్న వైనం పోలీసులను నివ్వెరపరుస్తోంది. నాలుగు నెలల క్రితం నిజామాబాద్ జిల్లాలో 10 మంది అరెస్టవగా తాజాగా కరీంనగర్‌లో 13 మంది మ్యూల్ ఖాతాలు అందించిన నేరంపై పట్టుబడ్డారు. రాష్ట్రంలో యేడాది క్రితం హైదరాబాద్‌కు చెందిన ఓ నగల వ్యాపారి నుంచి కొందరు సైబర్ నేరగాళ్లు విదేశీ పెట్టుబడుల పేరిట 7.88 కోట్ల రూపాయలను కాజేయగా దీనికి సంబంధించిన నగదు తరలింపునకు నిజామాబాద్‌కు చెందిన మ్యూల్ ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్ల ఖాతాలకు బదలీ అయ్యాయని తేలింది. ఈ కేసులో మ్యూల్ ఖాతాలు అందించిన 10 మంది అరెస్టయ్యారు. అంతకు ముందు టిజిసిఎస్‌బి అధికారులు గుజరాత్, రాజస్థాన్‌లకు చెందిన 40 మంది అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్టు చేయగా వీరంతా మియన్మార్, కాంబోడియా, వియత్నాం కేంద్రంగా జరిగే సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నట్లు తేలింది. ఈ మూడు దేశాలలో వుంటున్న బడా సైబర్ నేరగాళ్లకు ఇక్కడ పట్టుబడ్డ నేరగాళ్లు కేవలం బ్యాంకుల ఖాతాలను ఇస్తున్నారని తేలింది. ఇందుకుగానూ ఐదు నుంచి పది శాతం కమీషన్ తీసుకున్నారు. తాజాగా కరీంనగర్ లో 13 మంది మ్యూల్ ఖాతాలు కలిగిన వారు అరెస్టవగా ఈ ఖాతాల నుంచి 12.25 కోట్ల నగదును విదేశాలకు అక్రమంగా మళ్లించినట్లు తేలింది. అంతకు ముందు సూర్యాపేట్‌లోని మూడు గ్రామాలకు చెందిన 20 మంది యువతీ యువకులు ఈ తరహా నేరం చేసి పోలీసులకు దొరికిపోయారు. ఏడాది వ్యవధిలో ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్‌కు చెందిన 50 బడా సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు ఇచ్చి పోలీసులకు చిక్కారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల పోలీసులను అప్రమత్తం చేసి ఆపరేషన్ క్రాక్‌డౌన్ చేబట్టింది.

# అసెంబ్లీలో ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, పర్యవేక్షణ బిల్లు

## సభలో రెండు ప్రభుత్వ బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రులు

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త :** శాసనసభలో రెండు ప్రభుత్వ బిల్లులను శనివారం మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ ప్రవేశపెట్టారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అనుమతితో తెలంగాణ పంచాయతీరాజ్ 3వ సవరణ బిల్లును మంత్రి సీతక్క ప్రవేశపెట్టారు. తెలంగాణ తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం, పర్యవేక్షణ బిల్లును మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రవేశపెట్టారు. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ కార్యక్రమాలను రద్దు చేశారు. సింగరేణి కాలరీస్ వార్షిక నివేదకను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సభా సమక్షంలో ఉంచారు.

# ఎస్సారెస్పీ కాలువలో దూకి తల్లీకుమారుడు ఆత్మహత్య

**వర్ధన్నపేట/మార్చి 28, ప్రభాతవార్త:** వర్ధన్నపేట మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మూడేళ్ల పసికందుతో సహా ఓ తల్లి ఎస్సారెస్పీ కాలువలోకి దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ హృదయవిదారక ఘటన శనివారం మండల పరిధిలోని కట్రియాల గ్రామ శివారులో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కట్రియాల గ్రామానికి చెందిన కామిండ్ల కళ్యాణి (30) తన మూడేళ్ల కుమారుడు శ్రేష్యాన్స్ తో కలిసి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో దూకింది. కాలువలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే కళ్యాణికి నాలుగేళ్ల క్రితం జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలానికి చెందిన కామిండ్ల హరీష్‌తో వివాహం జరిగింది. హరీష్ ప్రస్తుతం మామునూరు బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లీకొడుకుల మృతితో కట్రియాల గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, కళ్యాణి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# నర్సాపూర్‌లో హల్దీ వేడుకలు.. 41 మందికి అస్వస్థత

## ముగ్గురు చిన్నారుల పరిస్థితి విషమం.. సంగారెడ్డికి తరలింపు



నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

**నర్సాపూర్ మార్చి 28, ప్రభాతవార్త:** వివాహం సందర్భంగా ముందు రోజున హల్దీ వేడుకలో పాల్గొని హల్దీ వేడుకలో తిన్న ఆహారం వికటించి 41 మంది అస్వస్థతకు గురైన సంఘటన నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు ఇలా వున్నాయి. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో కంప్యూటర్ సెంటర్ నిర్వహించే మహమ్మద్ అవేజ్ వివాహం ఆదివారం రోజున జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ముందు రోజున హల్దీ వేడుకలతో పాటు గృహప్రవేశ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ వేడుకలకు తమ సమీప బంధువులను ఇరుగు పొరుగు వారిని ఆహ్వానించారు. ఈ వేడుకలకు హాజరైన వారంతా ఈ హల్దీ వేడుకల్లో మాంసాహారం భోజనం చేశారు. భోజనం చేసిన కొద్దిసేపటికే అందరూ వాంతులు వీరేశనాలతో బాధపడుతూ సుమారు 41 మంది అస్వస్థతకు గురేకాగా వెంటనే పలువురు స్పందించి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. ఈ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం కొందరు ఆరోగ్యం కుదుటపడడంతో అదే రాత్రి ఇంటికి వెళ్లిపోయారు. ఇందులో 9 మంది ఈ ఆస్పత్రిలోని చికిత్స పొందుతున్నారు. ఇందులో కూడా ముగ్గురు పిల్లల ఆరోగ్యం క్షీణించడంతో డాక్టర్ల సూచనల మేరకు సంగారెడ్డి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు అందరి ఆరోగ్య పరిస్థితులు బాగానే ఉందని ఎవరికి ఎలాంటి ప్రమాదము లేదని డాక్టర్లు వెల్లడించారు. ఈ విషయమై ఆసుపత్రి సూపర్డెంట్ పావని మాట్లాడుతూ ప్రస్తుతం అందరి పరిస్థితి మెరుగుపడిందని అందులో ముగ్గురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు ఈ విషయమై డి ఎం హెచ్ కు సమాచారం ఇవ్వగా ఆయన ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్స్పెక్టర్ ఫంక్షన్ జరిగిన ప్రాంతానికి వచ్చి శాంపిల్ సేకరించారని ఆమె తెలిపారు

# 30న హైవేల దిగ్బంధానికి పిలుపు

## తోపులాటలు, అరెస్టులతో ఉద్రిక్తత, పలువురికి గాయాలు

## ప్రభుత్వం దిగిరాకుంటే నిరవధిక సమ్మె: ఆశా యూనియన్

**హైదరాబాద్ (చిక్కడపల్లి) మార్చి 28, ప్రభాతవార్త:** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు శనివారం చేపట్టిన చలో హైదరాబాద్ ఉద్రిక్తతకు దారితీసింది. రాష్ట్రవ్యాప్తంగా వందలాది ఆటంకాలను, పోలీసుల నిర్బంధాలను ఛేదించుకుని వేలాదిగా తరలివచ్చిన ఆశా వర్కర్లు ఇందిరా పార్కు వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆశా కార్యకర్తలకు మధ్య జరిగిన వాగ్వాదం , తోపులాటలతో ఆ ప్రాంతం రణరంగంగా మారింది. ముందుగా నిర్ణయిం చిన ప్రకారం.. నగరంలోని డీబీఆర్ మిల్లు నుండి ఆశా వర్కర్లు భారీ ర్యాలీగా బయలుదేరారు.

ఆర్టీసీ క్రాస్‌ఇం రోడ్స్ వద్దకు రాగానే పోలీసులు వారిని బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన కార్యకర్తలు అక్కడే రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆశాలకు మధ్య తీవ్రస్థాయిలో తోపులాటలు జరిగాయి. ఈ ఘర్షణల్లో యూనియన్ నాయకులతో పాటు పలువురు ఆశా కార్యకర్తలకు గాయాలయ్యాయి. అనంతరం పోలీసులు వేలాది మందిని బల వంతంగా అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రభుత్వ నిరక్ష్య వైఖరికి నిరసనగా మార్చి 30న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉదయం 10 నుండి 11 గంటల వరకు హైవే రహదారులపై రాస్తారోకో నిర్వహించాలని ఆశా యూనియన్ (సిఐటియు) పిలుపు నిచ్చింది. అప్పటికీ ప్రభు త్వం స్పందించక పోతే రాబోయే వర్షాకాలం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆర్. నీలాదేవీ, కోశాధికారి పి.గంగమని, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సిఐటియు రాష్ట్ర సహాయ కార్య దర్శులు శ్రీకాంత్, సుధాకర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ నాయకులు దశరథ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మీనా శ్రావణ్ కుమార్ ఆశా రాష్ట్ర నాయకులు టి. యాదమ్మ, పద్మ, సావిత్రి, రేవతి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఆశా వర్కర్స్ ఆందోళన సందర్భంగా అరెస్ట్ చేసిన పోలీసులు

# ఎత్తిపోతలకు 24 గంటలు విద్యుత్ ఇవ్వలేం

## పగటిపూట సౌర విద్యుత్ వాడండి

### నీటి పారుదల శాఖకు రాష్ట్ర విద్యుత్ సంస్థ లేఖ

**హైదరాబాద్, మార్చి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలకు 24 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేయలేమని తెలంగాణ విద్యుత్ సంస్థ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్‌కో) స్పష్టం చేసింది. రాష్ట్రంలో ప్రస్తుత రబీ సీజను జరుగుతున్నందున అందుకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి సౌర విద్యుత్ వినియోగానికే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపింది. ఈ మేరకు సాగు నీటి పారుదల శాఖ అధికారులకు ట్రాన్స్కో లేఖ రాసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎత్తిపోతల పథకాలను గరిష్టంగా పగటిపూటే పనిచేసేలా చూడాలని అందులో వెల్లడించింది. ఇందుకు గాను పగటి సమయంలో సౌర విద్యుత్ సరఫరా అయ్యే సమయాల్లోనే ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని పంపింగ్ చేయాలని సూచించింది. ఇందువల్ల ఆయా ఎత్తిపోతల పథకాలకు అయ్యే ఆర్థిక భారం తగ్గుతుందని స్పష్టం చేసింది. ఆమేరకు అందుకు అనుగుణంగా సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేయాలని పేర్కొంది. కాగా దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా 62 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు పంపులను 24 గంటల పాటు నడిపేందుకు వీలుగా విద్యుత్ సరఫరా చేయాలంటూ ఇటీవల నీటిపారుదల శాఖ అధికారులు విద్యుత్ ట్రాన్స్‌మిషన్ అధికారులకు ఒక లేఖ రాశారు. దీనిపై స్పందించిన ట్రాన్స్‌కో తాజాగా దానికి సమాధానం ఇచ్చింది. రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలను పగలు, రాత్రి పనిచేయిస్తే అందుకు విద్యుత్ భారీగా సరఫరా చేయాల్సి వస్తుందని ట్రాన్స్కో వెల్లడించింది. ఇందువల్ల విద్యుత్ డిమాండ్ పెరిగి బహిరంగ విపణిలో విద్యుత్‌ను అత్యధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని చెప్పింది. ఫలితంగా విద్యుత్ సరఫరా సంస్థలపై ఆర్థిక భారం తీవ్రంగా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే విద్యుత్ బిల్లుల బకాయిలు భారీగా పేరుకుపోయాయని తెలిపింది.. దాదాపు రూ.33,660 కోట్ల మేర బకాయిలు విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సి ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో 24 గంటల పాటు విద్యుత్‌ను సరఫరా చేయడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలకు పగటి పూట తక్కువ ధరలకు లభించే సౌర విద్యుత్‌ను ఉపయోగించాలని వెల్లడించింది.

